క్లుప్తంగా

బాల్య వివాహాలు నేరం

కైలాస్‌నగర్: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని పలువురు వక్తలు అన్నారు. బాల్య వివాహాల నిరోధక చట్టం 2006పై బుధవారం బాలరక్షక భవన్‌లో జిల్లాలోని ఐసీడీఎస్ సీడీపీవోలు, సూపర్‌వైజర్లకు అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు జరగకుండా గ్రామాల్లో చేపట్టాల్సిన చర్యల గురించి వివరించారు. బాల్యవివాహాలు చేస్తే రెండేళ్ల జైలు శిక్ష, రూ.2లక్షల జరిమానా విధించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డీసీపీవో రాజేంద్రప్రసాద్, సీడబ్ల్యూసీ చైర్మన్ వెంకట స్వామి, సభ్యులు, సమీరుల్లా ఖాన్, డేవిడ్, దశరథ్, తదితరులు పాల్గొన్నారు.

'హక్కుల సాధన కోసం ఉద్యమిద్దాం'

ఇంద్రవెల్లి: ఆదివాసీ హక్కుల కోసం ఉద్యమించాలని ఆదివాసీ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కోవ దౌలత్‌రావ్ మొకాశి పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని కేస్లాపూర్ నాగోబా దర్బార్ హాల్‌లో ఆదివాసీ సేన నాయకులతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. పోడు భూములకు పట్టాలు, ఇతర కులాలను ఎస్టీ జాబితాలో చేర్చే విషయాలపై చర్చించారు. సమావేశంలో మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆత్రం భుజంగ్‌రావ్, సెడ్మకి గోద్రు, మెస్రం ఆనంద్‌రావ్, దుర్గు పాల్గొన్నారు.

ఎస్‌ఎంసీ చట్టబద్ధమైన సంస్థ

బేల: ఎస్‌ఎంసీ (పాఠశాల నిర్వహణ కమిటీ) చట్టబద్ధమైన సంస్థ అని పాఠశాలల్లో మౌలిక వసతులపై చొరవ తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి సుర్జిత్‌ఖాన్ అన్నారు. బుధవారం మహిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఎస్‌ఎంసీ చైర్మన్‌లు, సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లకు పాఠశాల నిర్వహణ కమిటీ బలోపేతం, అభివృద్ధి ప్రణాళికపై సమావేశం నిర్వహించారు. రెండో సెక్టోరియల్ అధికారి నర్సయ్య, ఎంఈవో గంగుల శ్రీనివాస్, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం కోల నర్సింలు, శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

సిరికొండ: వాల్మీకి బోయ, ఖైతీ తెగల వారిని మొత్తం 11 కులాలను ఎస్టీ జాబితాలో చేర్చడాన్ని నిరసిస్తూ.. బుధవారం మండల కేంద్రంలో కుమురం భీం చౌరస్తాలో తుడుందెబ్బ నాయకులు ఆందోళన చేపట్టారు. ఈనెల 20న ఉట్నూర్‌లోని ఐటీడీఏ కార్యాలయం ముట్టడిని విజయవంతం చేయాలని కోరారు. ఆదివాసీ నాయకులు పెందుర్ అమృత్ రావు, రఘురాం, సార్‌మోడీలు పంద్ర అమృత్‌రావు, తోడసం అమృత్‌రావు పాల్గొన్నారు.

అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవు

నేరడిగొండ: ఉపాధిహామీ పథకంలో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని ఏపీడీ అస్రార్ సిద్దిఖీ హెచ్చరించారు. బుధవారం మండలంలోని లింగట్ల గ్రామ పంచాయతీలో సమావేశం నిర్వహించారు. సోమవారం ప్రజా ఫిర్యాదుల విభాగంలో దర్బార్ అనే యువకుడు ఉపాధిహామీ పథకంలో అవినీతి జరుగుతుందని ఫిర్యాదు చేశాడు. దీంతో విచారణ కోసం గ్రామంలో సమావేశం నిర్వహించి వివరాలు సేకరించారు. సమావేశంలో సర్పంచ్ సాబ్లే స్వర్ణాంజలి, ఈజీఎస్ ఏపీవో వసంత్ రావ్, పీఏసీఎస్ చైర్మన్ కిషోర్ సింగ్, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్ పాల్గొన్నారు.

'భవన నిర్మాణాన్ని అడ్డుకుంటున్న ఎమ్మెల్యే'

బోథ్: తహసీల్దార్ నూతన భవన నిర్మాణాన్ని బోథ్ ఎమ్మెల్యే బాపురావు అడ్డుకుంటున్నాడని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. దాదాపు రూ.2 కోట్లతో నిర్మించే భవన నిర్మాణానికి ఎమ్మెల్యే నిధులు కుదించే పనుల్లో ఉన్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి ప సుల చంటి, కార్యనిర్వాహక అధ్యక్షుడు మహమ్మద్, మైనారిటీ సెల్ నాయకులు షేక్ నాజర్ అహ్మద్, గుడాల శేఖర్, రామాయి రాము, భోజన్న, అనిల్ చెట్లపెల్లి, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ బత్తుల రమేష్ పాల్గొన్నారు.

అడవుల సంరక్షణ అందరి బాధ్యత

నేరడిగొండ: అడవుల సంరక్షణ అందరి బాధ్యత అని కుంటాల సెక్షన్ అధికారి వసంత్ కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని సిరిచెల్మ రేంజ్ (కేటీఆర్) పరిధిలోని కుంటాల (కె)లో అడవిలో అగ్ని ప్రమాదాలు, అడవి సంరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. సమావేశంలో ఎఫ్‌బీవో సచిన్, సర్పంచ్ అశోక్, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

నార్నూర్: మిషన్ భగీరథ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కాంట్రాక్ట్ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు అల్లురి లోకేష్ కోరారు. బుధవారం గాదిగూడ మండలంలోని ఝరి పంప్ హౌజ్ వద్ద మిషన్ భగీరథ కార్మికులతో సమావేశం నిర్వహించారు. వాల్ ఆపరేటర్, పంప్ ఆపరేటర్స్, హెల్పర్స్ ఇతర విభాగాల్లో పని చేసే కార్మికులకు కనీస వేతనంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలు మంజూరు చేయాలన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె చేస్తామని హెచ్చరించారు.

ఘనంగా సేవాలాల్ జయంతి

● ప్రత్యేక పూజలు చేసిన నాయకులు



నార్నూర్: భక్తులతో కలిసి పల్లకి మోస్తున్న రాథోడ్ జనార్దన్

నార్నూర్: లంబాడా గిరిజనుల ఆరాధ్యదైవం శ్రీసంత్ సేవాలాల్ మహరాజ్ ఆశయాలను కొనసాగించాలని జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ సూచించారు. బుధవారం మండలంలోని తాడిహత్నూర్ గ్రామంలో సేవాలాల్ మహరాజ్ జయంతి సందర్భంగా పల్లకి శోభాయాత్ర నిర్వహించారు. ఈ నెల 23న జిల్లా కేంద్రంలోని రాంలీలా మైదానంలో జయంత్యుత్సవాలను అధికారికంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జాదవ్ చంద్రశేఖర్, సర్పంచ్ రాథోడ్ మధుకర్, గ్రామ పెద్దలు రాథోడ్ శేషరావు, గంగారాం నాయక్, అడే ప్రేంసింగ్, జాదవ్ శ్రీకాంత్, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేరడిగొండ: బంజారాల ఆరాధ్య దైవం సేవాలాల్ మహరాజ్ జీవితం అందరికీ ఆదర్శప్రాయమని ప్రభుత్వ లఖంపూర్ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అశోక్‌రావు అన్నారు. బుధవారం పాఠశాల ఆవరణలో సేవాలాల్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

మండలంలోని రాజుర గ్రామంలో జెడ్పీటీసీ అనిల్ జాదవ్ పాల్గొని సేవాలాల్ మహరాజ్ విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. లంబాడా గిరిజనుల అభ్యున్నతి కోసం ఎంతో కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో పూజారి మేఘరాజ్, వసంత్, సర్పంచ్ అంబు నాయక్, నారాయణ, మాజీ ఎంపీపీ గణేష్ నాయక్ సారజీ, కాశీరాం, రవి జవర్ పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: మండల కేంద్రంతో పాటు ఆయా లంబాడా తండాల్లో బుధవారం సేవాలాల్ మహరాజ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో శేశేరావ్‌నాయక్, ప్రేమ్‌సింగ్, అంబాజీ, రాథోడ్ సంజీవ్, చౌహాన్ ఉత్తంనాయక్, పవార్ మనోజ్, పవర్ శంకర్ పాల్గొన్నారు.

బోథ్: సేవాలాల్ జీవితం భావితరాలకు ఆదర్శమని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సాయినగర్‌లో సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యేతో పాటు నేరడిగొండ జెడ్పీటీసీ అనిల్‌జాదవ్‌లు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు నారాయణ రెడ్డి, రుక్మాన్‌సింగ్, వైస్ ఎంపీపీ లింబాజీ, సంజీవ్ రెడ్డి, సురేందర్, తాహెర్ బిన్ సలాం, జాదవ్ నరేష్ పాల్గొన్నారు.

కైలాస్‌నగర్: సంచార జీవనం గడుపుతున్న బంజారాలను జాగృతం చేసి, జాతి ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిన మహనీయుడు సేవాలాల్ మహరాజ్ అని ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. బుధవారం పట్టణంలోని సేవాదాస్ విద్యామందిర్‌లో నిర్వహించిన సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలకు హాజరయ్యారు. సేవాలాల్ చిత్రపటానికి పూజలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వెంకట స్వామి, ఉపాధ్యాయులు రాజశేఖర్, అశోక్, వసుధ, నిఖిత, చైతన్యరాణి, ఉర్మిళ, సూర్యప్రకాష్, నర్సయ్య పాల్గొన్నారు.

తాంసి: భీంపూర్ మండల కేంద్రంలో సేవాలాల్ మహరాజ్ జయంతిని పురస్కరించుకొని పల్లకి ఊరేగింపు నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పల్లకిని ఊరేగించారు. సేవాలాల్ భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో రవీందర్ జాదవ్, ఉత్తం, మహేష్ పాల్గొన్నారు.



ఇంద్రవెల్లి: పూజలు చేస్తున్న నాయకులు



బోథ్: పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బాపురావు



నేరడిగొండ: పూజలు చేస్తున్న జెడ్పీటీసీ అనిల్ జాదవ్

'హామీలు విస్మరించిన బీఆర్‌ఎస్'



మాట్లాడుతున్న చిట్యాల సుహాసిని రెడ్డి

ఆదిలాబాద్: ఎన్నికల సమయంలో బీఆర్‌ఎస్ ఇచ్చిన హామీలను విస్మరించిందని బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసిని రెడ్డి అన్నారు. ఆదిలాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని సుందరయ్య నగర్ కాలనీలో బుధవారం నిర్వహించిన బీజేపీ శక్తికేంద్రం కార్నర్ మీటింగ్ కార్యక్రమానికి హాజరయ్యారు. ఎమ్మెల్యే జోగు రామన్న అన్ని వర్గాల సంక్షేమానికి, అభివృద్ధికి పాటుపడతామని హామీలిచ్చి అనంతరం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సమస్యలను ప్రస్తావిస్తే విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఖైతి లంబాడాలను ఎస్టీ జాబితాలో చేర్చాలి

నేరడిగొండ: ఖైతి లంబాడాలను ఎస్టీ జాబితాలో చేర్చాలని బీజేపీ మండల నాయకులు కోరారు. బుధవారం మండలంలోని బుగ్గారం(బి)లో ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈనెల 10న తెలంగాణ అసెంబ్లీలో ఖైతి లంబాడాలను ఎస్టీ జాబితాలో చేర్చుతూ.. రాష్ట్ర ప్రభుత్వం తీర్మానం చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సాబ్లే సంతోష్ సింగ్, సోలంకి ప్రశాంత్, సోనయ్య హీరాసింగ్, భాత్రే శంకర్, జాట్వే శ్రీను పాల్గొన్నారు.

పరిహారం ఇచ్చే వరకూ పోరాటం



దీక్షలో పాల్గొన్న పిప్పల్‌కోటి రైతులు

తాంసి: పిప్పల్‌కోటి రిజర్వాయర్ నిర్మాణంలో భూములను కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం పరిహారం ఇచ్చే వరకు పోరాటం చేస్తామని ముంపు రైతులు స్పష్టం చేస్తున్నారు. రెండో రిలే దీక్షలో పాల్గొని నిరసన వ్యక్తం చేశారున. నాలుగేళ్ల క్రితం ఎకరానికి రూ.8లక్షలు ఇస్తామని చెప్పి ఇప్పుడు పరిహారం తగ్గించడం ఏంటని ప్రశ్నించారు. ప్రస్తుతం మార్కెట్ రేటు ప్రకారం ఎకరానికి రూ.20 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లేష్ నాయకులతో కలిసి రైతులకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో రైతులు స్వామి, సంతోష్, భూమన్న,చ ఉద్దవ్, నర్సింగ్, నసీరుద్దీన్, విలాస్ పాల్గొన్నారు.

నైపుణ్యాలు పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ ప్రేమేందర్

ఆదిలాబాద్‌రూరల్: విద్యార్థులు ఆసక్తి కలిగిన రంగాల్లో నైపుణ్యాలు పెంపొందించుకోవాలని ఆదిలాబాద్ మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కొలాం ఆశ్రమ పాఠశాలలో ఏర్పాటు చేసిన డివిజన్‌స్థాయి స్పోర్ట్స్ కల్చర్ ఫెస్ట్‌ను ప్రారంభించారు. విద్యార్థులకు డాన్స్, ఉపన్యాసం, క్విజ్, వ్యాసరచన, పాటలు, డ్రాయింగ్, రంగోలి, మాక్ పార్లమెంట్, స్పెల్‌బీ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన సంస్కృతిక నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఏటీడీవో నిహారిక, జిల్లా గిరిజన క్రీడలాభివృద్ధి అధికారి కోరెడ్డి పార్థసారథి, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు నారాయణ్‌రావు, లక్ష్మినారాయణ, ప్రేందాస్, అరుణ, అశోక్ పాల్గొన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ లస్మన్న

తాంసి: భీంపూర్ మండల కేంద్రంలోని రైతువేదికలో బుధవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. వైస్ ఎంపీపీ గడ్డం లస్మన్న అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో అధికారులు పాల్గొని ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. ఏవో రవీందర్ మాట్లాడుతూ.. మొత్తం 7774 మంది రైతులకు రైతుబంధు నిధులు విడుదలైనట్లు తెలిపారు. ఏఈ చంద్రశేఖర్ మాట్లాడుతుండగా.. గ్రామాల్లో భగీరథ నల్లా కనెక్షన్‌లో పూర్తిస్థాయిలో లేవని, నీటి సమస్య తలెత్తుందన్నారు భీంపూర్, పిప్పల్‌కోటి గ్రామాల సర్పంచ్‌లు లింబాజీ, కల్యాణి ప్రశ్నించారు. రేషన్ సరుకులు తీసుకునేందుకు గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారని సభ్యులు డిప్యూటీ తహసీల్దార్ దృష్టికి తీసుకువచ్చారు. విద్యుత్‌శాఖ ఏఈఈ మాట్లాడుతుండగా.. పల్లెప్రగతిలో భాగంగా విద్యుత్ స్తంభాలు ఇప్పటివరకు ఎందుకు వేయలేదని ప్రశ్నించారు. అనంతరం ఉపాధిహామీ, అటవీశాఖ, ఐకేపీ, వైద్యశాఖ, రవాణా శాఖ, విద్యశాఖ అధికారులు తమ ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సుధాకర్, ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ మహేంద్రనాథ్, తదితరులు పాల్గొన్నారు.

26 మంది సర్పంచ్‌లకు ఆరుగురే హాజరు..

మండలంలోని మొత్తం 26 సర్పంచ్‌లకు ఆరుగురు మాత్రమే హాజరయ్యారు. సర్పంచ్‌లు హాజరు కాకుంటే సమస్యలు ఎలా పరిష్కరం అవుతాయని మండలవాసులు ప్రశ్నిస్తున్నారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ.. వచ్చే మండల సర్వసభ్య సమావేశానికైనా సర్పంచ్‌లు హాజరు కావాలన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

ఆదిలాబాద్‌రూరల్: మావల మండలంలోని వాఘాపూర్‌లో జోగు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీలను ఆదిలాబాద్ మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయలక్ష్మి రాజు, జెడ్పీటీసీ నల్ల వనిత రాజేశ్వర్, నారాయణ, మాజీ ఎంపీపీ చందాల ఈశ్వరీ రాజన్న, నరోత్తం రెడ్డి, బాపురావ్, అశోక్, పండ్ల శ్రీను పాల్గొన్నారు.

సిరికొండ: మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర అధ్యాపకుల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ ఆధ్వర్యం క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువకులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. ఎంపీ సోయం బాపురావు కుమారుడు సోయం వేంకటేశ్, ఎంపీపీ పెందుర్ అమృత్ రావు, ఉప సర్పంచ్ తోకల చిన్న రాజన్న, నాయకులు రఘురాం, మాణిక్ రావు, అమోల్ పాల్గొన్నారు.

పీడీయాక్ట్ నమోదు చేయాలి

బోథ్: రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన హమారా ప్రసాద్‌పై పీడీయాక్ట్ నమోదు చేయాలని అంబేద్కర్ సంఘం సభ్యులు ఆందోళన చేపట్టారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. మేధావులు ఈ విషయంపై గళం విప్పాలన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కంది ప్రవీణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి బత్తుల రమేష్, పసుల చంటి, అడ్లూరి మహిపాల్, షేక్ షాకీర్, సుమేర్ పాషా, కుర్మె ప్రభాకర్, రామకృష్ణ, రామచందర్, నందయ్య పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

సీసీరోడ్ల పనులు ప్రారంభం

బోథ్: మండలంలోని పట్నాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని మేడిగూడ, ఇంకర్‌పల్లిలో సీసీరోడ్ల పనులను సర్పంచ్ సుగుణ బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కైలాస్, వార్డు సభ్యులు కుంరం లక్ష్మి, ఆత్రం మోహన్, తొడసం నీలకాంత్, మాజీ సర్పంచ్ గోపాల్, దశరథ్, సుంగన్న, మడావి శేఖరావ్ పాల్గొన్నారు.

పరామర్శ

బజార్‌హత్నూర్: మండలంలోని జాతర్ల గ్రామంలో డీఆర్‌డీఏ ఏపీడీ అర్క చరణ్‌దాస్ తల్లి అర్క రాధబాయి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. కాగా ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావు బుధవారం కుటుంబసభ్యులు అర్క తుకుడోజీ, చరణ్‌దాస్, హరిదాస్, మధుకర్‌లను పరామర్శించారు.

బోథ్: మండలంలోని సోనాల గ్రామానికి నియోజకవర్గ ప్రచార కమిటీ కార్యదర్శి రామాయి సదానందం తండ్రి రామాయి శంకర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. కాగా బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు బుధవారం ఇంటికి వెళ్లి పరామర్శించారు.

తలమడుగు: మండలంలోని లింగి, కుచులాపూర్ గ్రామాల్లోని బాధిత కుటుంబాలను వన్నెల ట్రస్ట్‌చైర్మన్ అశోక్ పరామర్శించారు.

నేడు ఎమ్మెల్యే రాక

బోథ్: బోథ్ మండల కేంద్రానికి గురువారం ఎమ్మెల్యే బాపురావు రానున్నట్లు మండల కన్వీనర్ నారాయణ రెడ్డి బుధవారం తెలిపారు. మధ్యాహ్నం 1 గంటలకు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ, 2 గంటలకు నియోజకవర్గంలోని కార్యకర్తలతో సమావేశం ఉంటుందని పేర్కొన్నారు.

సన్మానం

కైలాస్‌నగర్: మాలీలకు ఎస్టీ హోదా కల్పించేలా అసెంబ్లీలో తీర్మానం చేసిన ఆదిలాబాద్, బోథ్ ఎమ్మెల్యేలు జోగు రామన్న, రాథోడ్ బాపురావులను బుధవారం మాలీ సంఘం నేతలు సన్మానించారు. స్వీట్లు తినిపించి, మహాత్మా జ్యోతిరావు పూలే ఫోటోను బహుకరించారు. రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పెటుకలే, సాంబన్న శిండే, గురునులే సతీష్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న సప్తాహం

ఇచ్చోడ: మండలంలోని ముఖరా(బి)లో సప్తాహం కొనసాగుతోంది. బుధవారం నిర్వహించిన సప్తాహ కార్యక్రమంలో మహిళలతో పాటు సర్పంచ్ మారుతి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. చివరి రోజు వైష్ణవ సదన్ పీఠాధిపతి నారాయణ మహరాజ్ ఆధ్వర్యంలో ప్రవచన కార్యక్రమం ఉంటుందని సర్పంచ్ తెలిపారు.

సరుకులు పంపిణీ

తాంసి: మండలంలోని వామన్‌నగర్ గ్రామానికి చెందిన మెస్రం శ్రీనివాస్ మంగళవారం ఉరి వేసుకోని ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా బాధిత కుటుంబాన్ని బుధవారం టీపీసీసీ కార్యవర్గ సభ్యుడు వన్నెల అశోక్ పరామర్శించి నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కిష్ట న్న, స్వామి, రాజ్‌బలి, భూమన్న పాల్గొన్నారు.


సమస్యల పరిష్కారానికి కృషి

ఎదులాపురం: రణదీవెనగర్ కాలనీవాసులకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్, బీఆర్‌ఎస్ నాయకురాలు రంగినేని మనీషా అన్నారు. బుధవారం పట్టణంలోని రణదివేనగర్ కాలనీలో పర్యటించారు. ఆమె వెంట మహిళలు, యువకులు ఉన్నారు.

హీరాసుక్క జయంతి

జైనథ్: ఆదివాసీల ధర్మగురు హీరాసుక్కా జయంతిని మండలంలోని సుందరగిరి గ్రామంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం హీరాసుక్క జెండా వద్ద ప్రత్యేక పూజలు చేశారు. పర్ధాన్ సమాజ్ మండల అధ్యక్షుడు గంగప్రసాద్, సభ్యులతో కలిసి పూజలు నిర్వహించారు. ప్రతిఒక్కరూ హీరాసుక్క మార్గంలో నడవాలన్నారు. సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలన్నారు.

'ఎంపీపీపై చర్యలు తీసుకోవాలి'



వినతిపత్రం అందజేస్తున్న పాత్రికేయులు

తలమడుగు: ఇచ్చోడ ఎంపీపీపై చర్యలు తీసుకోవాలని మండల కేంద్రానికి చెందిన పాత్రికేయులు డిమాండ్ చేశారు. బుధవారం తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యవర్గ సభ్యులు ఆడెలు మాట్లాడుతూ.. పాత్రికేయులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. పాత్రికేయులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అశోక్, శివ, రవి, తిరుపతి, నగేశ్, అరవింద్, తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. వంతెన ప్రారంభించేదెప్పుడో?



బజార్‌హత్నూర్: మండల కేంద్రానికి సమీపంలో జాతర్ల ఆర్‌అండ్‌బీ రోడ్డుపై నిర్మించిన వంతెన ఆరు నెలలు గడిచిన ఇప్పటికీ ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో మండల కేంద్రానికి వచ్చే ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వంతెనను ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.

సంబంధిత అధికారి: సునీల్, డీఈ ఆర్‌అండ్‌బీ, ఫోన్: 84649 60600

బీజేపీ మాటలు ప్రజలు నమ్మరు

● ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రామన్న

ఆదిలాబాద్‌అర్బన్: బీజేపీ మాటలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ నగర్‌లో శ్మశాన వాటిక అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. రూ.45 లక్షల వ్యయంతో చేపట్టనున్న పనులకు సంబంధించి మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్‌తో కలిసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం గౌతమ బుద్ధుడు, బీఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పట్టణంలోని అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ప్రజలకు మౌలిక వసతులను కల్పించడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజానీ, డీఈ తిరుపతి. బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు అజయ్, కౌన్సిలర్ రషీద్, ఏజాజ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్, నవీన్, అయూబ్, అంగోలి పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

ఆదిలాబాద్‌రూరల్: విద్య, వైద్యానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎస్సీ స్టడీ సర్కిల్ సెంటర్‌లో స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. 5 నెలల ఫౌండేషన్ కోర్స్ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు వివిధ పోటీ పరీక్షలకు సంబంధించిన స్టడీ మెటీరియల్‌ను అందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, స్టడీ సర్కిల్ సెంటర్ డైరెక్టర్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే ధ్యేయంగా ముందుకు..

జైనథ్: అభివృద్ధే ధ్యేయంగా సీఎం కేసీఆర్ ముందుకు వెళ్తున్నారని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. బుధవారం మండలంలోని కంఠ గ్రామంలో ఈజీఎస్ నిధులు రూ. 1.80కోట్ల నిర్మించనున్న సీసీరోడ్డు, రూ. 40లక్షలతో నిర్మించనున్న రామ మందిరం నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం రైతువేదికను ప్రారంభించారు. మండల కేంద్రంలోని రైతువేదికలో 96 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మార్శెట్టి గోవర్ధన్, నాయకులు సర్పన్ లింగారెడ్డి, తుమ్మల వెంకట్‌రెడ్డి, వేణుగోపాల్ యాదవ్, తల్లెల చంద్రయ్య, కంఠ సర్పంచ్ వైద్య బాలాజీ పాల్గొన్నారు.

'బాధితుడికి న్యాయం చేయండి'

నార్నూర్: మండల కేంద్రంలోని జీన్‌గూడ సమీపంలో డబుల్‌బెడ్ రూం ఇళ్ల నిర్మాణానికి స్థలం ఇచ్చిన బాధితుడికి న్యాయం చేయాలని బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ అమృత్‌లాల్‌కు మైనార్టీ నాయకులు, ఎంఐఎం మండలాధ్యక్షుడు బాబాఖాన్ వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 85/2 సర్వే నెంబర్‌లోని భూమిని ఎన్నో ఏళ్లుగా మండల కేంద్రానికి చెందిన షేక్ ఖాసీం సాగు చేస్తున్నారని, అధికారులు ప్రభుత్వ భూమిగా ఎంపిక చేసి, రెండు డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇస్తామని అధికారులు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. హామీ ప్రకారం బాధితుడికి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు షేక్ సలీం, షేక్ మన్సూర్, రఫీక్, బిలాల్, తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ పద్ధతులతో అధిక దిగుబడులు



అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త రాజశేఖర్

తాంసి: పత్తి పంటలో సమగ్ర యజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని ఏరువాక శాస్త్రవేత్త రాజశేఖర్ అన్నారు. బుధవారం మండలంలోని పొన్నారి గ్రామంలో వ్యవసాయ పరిశోధన స్థానం అదిలాబాద్ ఆధ్వర్యంలో పత్తి పంటలో సస్యరక్షణ పద్ధతుల గురించి అవగాహన కల్పించారు. చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. సోయాబీన్, శనగ, వేరుశనగ పంటలలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త రఘువీర్, తాంసి ఏడీఏ రవీందర్, సర్పంచ్ సంజీవ్‌రెడ్డి, ఉప సర్పంచ్ అశోక్, ఏఈవో యోగిరాజ్ పాల్గొన్నారు.